


# కాసుల కండువ

## విద్యుత్ శాఖలో అనధికార కనెక్షన్లు

### దరఖాస్తు చేయకుండానే.. అంచనాలు వేయకుండానే సర్వీసులు ఇచ్చేస్తున్న వైనం

బోరుబావి తవ్వుకొని విద్యుత్ కనెక్షన్ కోసం ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకుని, అందుకు సంబంధించి డీడీ మొత్తాన్ని చెల్లించి నెలల తరబడి కాళ్లరిగేలా విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరిగినా రైతుకు మాత్రం విద్యుత్ కనెక్షన్ రాదు. నిలదీసి అడిగితే సీనియారిటీ ప్రకారం విద్యుత్ కనెక్షన్లు మంజూరవుతాయనీ, కార్యాలయం చుట్టూ తిరగనవసరం లేదంటూ గద్దిస్తారు. జేబులో నుంచి పైసలు తీస్తే మాత్రం సీనియారిటీ ఉండదు, ఆన్‌లైన్ ధరఖాస్తు అవసరం అసలే ఉండదు. అడిగినంత ఇస్తే క్షణాల్లో విద్యుత్ కనెక్షన్ వచ్చేస్తుంది. ఈ పని చేస్తున్నది డివిజన్‌స్థాయి అధికారో... మండలస్థాయి ఇంజనీరో కాదు. కిందిస్థాయిలో ఉన్న లైన్‌మెన్, విద్యుత్ శాఖ కాంట్రాక్టర్లు. ఈ వ్యవహారం చిలమత్తూరు మండలంలో దందాగా సాగుతుండటం గమనార్హం.

చిలమత్తూరు




**ప్రభుత్వ ఆదాయానికి గండి**

అనధికారిక విద్యుత్ కనెక్షన్ల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఒకవైపు ప్రభుత్వానికి రావాల్సిన చలానాలు రాకపోవడం, మరో పక్క అనధికారికంగా విద్యుత్ వినియోగంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది.


కొత్తచామలపల్లి వద్ద అనధికారికంగా ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

8 నెలలుగా విద్యుత్ శాఖకు మండలంలో ఏఈ లేరు. దీంతో లైన్‌మెన్.. ఏఈ అవతారం ఎత్తారు. ఎవరైనా వ్యవసాయ, వ్యవసాయేతర, గృహ విద్యుత్ కనెక్షన్ కావాలంటే అధిక మొత్తంలో డబ్బు గుంజి వారే స్వయంగా అనధికారికంగా కనెక్షన్ ఇచ్చేస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం వచ్చే వినియోగదారులను కార్యాలయం వరకు రానీయకుండా

**● లైన్‌మెన్, కాంట్రాక్టర్లదే పెత్తనం**

మధ్యలోనే వారికి మాయమాటలు చెప్పి, వెనక్కు పంపేస్తున్నారు. తమకు పైసలిస్తే తామే అన్నీ చూసుకుంటామంటూ చెప్పి వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బు గుంజి అనధికారికంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చేస్తున్నారు. ఇటువంటి కనెక్షన్లు రికార్డుల్లో లేకపోవడంతో ఉన్నతాధికారులు కూడా వాటిపై దృష్టి పెట్టలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో లైన్‌మెన్లే ఉండటంతో అనధికార కనెక్షన్ల వ్యవహారం బయటకు పొక్కట్లేదు.

**● అంచనాలు తప్పనిసరి**

సాధారణంగా ఒక రైతు తన బోరు బావికి విద్యుత్ కనెక్షన్ కావాలంటే సవాలక్ష నిబంధనలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం ఏఈ వచ్చి ధరఖాస్తు చేసుకున్న రైతు పొలంలో బోరు ఉందా? దానికి విద్యుత్ కనెక్షన్ కోసం ఎన్ని స్తంభాలు అవసరం, కేబుల్ వైరు ఎంత మేర కావాలి తదితరాలను పరిశీలించి, అంచనాలు వేస్తారు. ఈ ప్రక్రియ ప్రతి దరఖాస్తుదారుడికి తప్పనిసరి. అనంతరం చెల్లించాల్సిన మొత్తాన్ని అధికారులు అంచనా వేస్తారు. విద్యుత్ శాఖకు డీడీ రూపంలో చెల్లించాలని సూచిస్తారు. ఇది అందరికీ తెలిసిందే. ఈ తతంగం ఏమీ లేకుండానే పైసలు ఇచ్చిన క్షణాల్లోనే కనెక్షన్లు మంజూరు చేసేస్తున్నారు. సీనియారిటీ ప్రకారం దరఖాస్తుదారుడికి విద్యుత్ కనెక్షన్ మంజూరు కావడానికి ఎంత సమయం పడుతుందో తెలీదు. దీనిని లైన్‌మెన్, కాంట్రాక్టర్లు అదునుగా తీసుకున్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తయి, విద్యుత్ కనెక్షన్ మంజూరయ్యేదెప్పుడంటూ అమాయక రైతులు, లేఔట్లు వేసే రియల్ వ్యాపారులను నమ్మిస్తున్నారు. తమకు డబ్బు ముట్టజెబితే అన్నీ తామే చూసుకుంటామని చెబుతున్నారు. మండల ఏఈ ప్రమేయం లేకుండానే పెద్దమొత్తంలో డబ్బు తీసుకుని, ఆగమేఘాల మీద విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నారు.


ప్రమాదమని తెలిసినా నేలపైనే ఏర్పాటు చేసిన అనధికార విద్యుత్ కనెక్షన్ వైరు

**ఉన్నతాధికారుల పర్యవేక్షణ శూన్యం**

చిలమత్తూరు మండలంలో అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేస్తున్నా సంబంధిత శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడా కనబడట్లేదు. మండలవ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇలాంటి అనధికారిక విద్యుత్ కనెక్షన్లు దర్శనమిస్తున్నాయి. కిందిస్థాయి లైన్‌మెన్, కాంట్రాక్టర్లు కుమ్మక్కై చేస్తున్న ఈ అక్రమాలపై పర్యవే



క్షణ పూర్తిగా లోపించిందనే చెప్పాలి. పైసలు ఇవ్వలేని వినియోగదారుడికి మాత్రం సీనియారిటీ పేరుతో కాలయాపన చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు.. అనధికారిక కనెక్షన్లు మాత్రం ఆగమేఘాలపై ఇస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

**విద్యుత్ అక్రమ కనెక్షన్లలో కొన్ని..**

- మండలంలోని కొత్తచామలపల్లి సమీపాన ఒక రైతు ఇటీవలే కొత్తగా బోరుబావి తవ్వుకున్నాడు. అతడికి విద్యుత్ కనెక్షన్ అవసరమని గుర్తించి, అక్కడ పనిచేసే లైన్‌మెన్ ఏకంగా రైతు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోకున్నా, పై అధికారుల అనుమతి లేకున్నా మరోచోట ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తవ్వి తీసుకొచ్చి, రైతు పొలంలో పాతించి, విద్యుత్ కనెక్షన్ ఇచ్చేశాడు.
- కోడూరు పంచాయతీ తుమ్మలకుంటలో గతంలో గ్రామానికి సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు పక్కనే ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో ఒక వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్న కారణంగా ఎలాంటి అంచనాలు లేకుండానే ట్రాన్స్‌ఫార్మర్‌ని మరోచోటకి మార్చేశారు.
- రొద్దంవారిపల్లి వద్ద రియల్ వ్యాపారులు ఏర్పాటు చేస్తున్న రిసార్ట్‌లో అనధికారికంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.
- దేమకేతేపల్లిలో ఒక వ్యక్తి పొలంలో అనధికారికంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దాని ద్వారా అనధికారికంగా పెద్ద మొత్తంలో విద్యుత్ వినియోగిస్తున్నారు. దీనికి సంబధించి సదరు వ్యక్తి దరఖాస్తు కూడా చేసుకోకపోవడం శోచనీయం.
- బందేపల్లిలో ఓ రైతు పొలంలో అంచనాలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. ఈ పనుల్లో రైతుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు లాగినట్లు సమాచారం.
- చిలమత్తూరు ప్రధాన రోడ్డులో 11 కేవీ లైన్ మార్పిడి అనుమతులు లేకుండానే చేసేశారు. కనీసం వినియోగదారుల నుంచి ధరఖాస్తు స్వీకరించకుండానే పైసలకు మమ అనిపించేశారు.

## గోరంట్లలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రం

### పాఠశాలను పరిశీలించిన కలెక్టర్

### ఏర్పాట్లపై సమీక్ష


కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

**గోరంట్ల, జనవరి 30:** స్థానిక న్యూమాంటిస్సోరి ప్రైవేటు పాఠశాలలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పలుమార్లు పాఠశాలను సందర్శించారు. చివరికి జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల ఎన్నికల కౌంటింగ్ గోరంట్లలోని న్యూమాంటిస్సోరి పాఠశాలలో, పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల కౌంటింగ్ లేపాక్షి గురుకుల పాఠశాలలో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ గోరంట్లలోని ప్రైవేటు పాఠశాలను సందర్శించి, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, ఆర్డీఓలు వంశీకృష్ణ, రమేష్‌రెడ్డి, భాగ్యరేఖతో కౌంటింగ్ కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు, రిసెప్షన్ సెంటర్లు, కౌటింగ్ కేంద్రాల గదులను పరిశీలించారు. పాఠశాలలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో పుట్టపర్తి, మొదటి అంతస్తులో ధర్మవరం, మూడో అంతస్తులో కదిరి నియోజకవర్గాల అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. సంబంధిత ఆర్డీఓలు సాయంత్రం వరకు పాఠశాల గదులు, వాటి కొలతలను బట్టి చేపట్టాల్సిన నిర్మాణాలు, తదితర చర్యలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు తహసీల్దార్లు, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.

## సుప్రీం తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

**పెనుకొండ, జనవరి 30:** తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడుపై మోపిన కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) కేసులో చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడం హర్షణీయమని బీకే మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అధికార గర్వంతో జగన్‌రెడ్డి అండ్ కో పెట్టిన కేసు తప్పుడు కేసని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందన్నారు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడన్నారు. జగన్‌రెడ్డి ఎన్నికుట్రలు చేసినా ప్రజలు.. చంద్రబాబు వెంటే ఉన్నారన్నారు. చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలతోనైనా జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గు తెచ్చుకోవాలని ఆయన చురకలు అంటించారు.


బీకే పార్థసారథి


పల్లె రఘునాథ రెడ్డి

### బాబుపై కుట్రలు ఇప్పటికైనా మానుకోవాలి: పల్లె

**పుట్టపర్తి:** సుప్రీంకోర్టు తీర్పుతోనైనా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై సీఎం జగన్ కుట్రలు చేయడం మానుకోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సూచించారు. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్‌ను రద్దు చేయలేమంటూ సుప్రీంకోర్టు తేల్చిచెప్పడం జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టుగా ఆయన ఓ ప్రకటనలో అభివర్ణించారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి తిరిగి జైలుకు పంపాలన్న జగన్ కుట్రలను కోర్టు తిప్పికొట్టిందన్నారు. అక్రమ కేసులు పెట్టి, వాటిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలని జగన్ చేస్తున్న కుట్రలపై ఆయన మండిపడ్డారు. వీటిని ప్రజలు గమనిస్తున్నారనీ, త్వరలోనే వైసీపీకి బుద్ధి చెబుతారన్నారు.

## కళ్లకు గంతలతో నిరసన

### కొనసాగిన డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగుల దీక్షలు

**పుట్టపర్తి, జనవరి 30:** డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగుల సమ్మె ఆరోరోజు మంగళవారం కళ్లకు గంతలు కట్టుకుని, వినూత్న నిరసన తెలిపారు. తొలుత ఎనుములపల్లి గణేష్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి, సమస్యలపై నినాదాలు చేశారు. అనంతరం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద దీక్షాశిబిరంలో కళ్లకు గంతలు కట్టుకుని, నిరసన తెలిపారు. ఆ ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలనీ, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలనీ, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకే దీక్షలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రామమోహన్, రమణప్ప, శంకర్, గోపాల్, రాధమ్మ, లక్ష్మీనారాయణ, శ్రీరామ్‌నాయక్, అంజినప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.


కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగులు

## ఇదేం.. మర్యాద..!

### వైసీపీ కదిరి ఇన్‌చార్జిని కలిసిన సీఐ.. అధికారి తీరుపై విమర్శలు

**కదిరి, జనవరి 30:** అధికారులు బదిలీపై వస్తే.. ఆ ప్రాంత ప్రజాప్రతినిధినో, మంత్రినో మర్యాదపూర్వకంగా కలవడం పరిపాటి. పట్టణ సీఐగా వచ్చిన పుల్లయ్య మాత్రం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిని మర్యాదపూర్వకంగా కలవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ సీఐగా పనిచేస్తున్న నారాయణరెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి పుల్లయ్యను నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వెంటనే వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బుల్‌బాషాను పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లి మరీ సీఐ కలిశారు. వస్తూనే వైసీపీ భజన చేస్తున్నారని సీఐపై పలువురు విమర్శిస్తున్నారు. వాస్తవానికి నియోజకవర్గంలో కొత్త అధికారులు వస్తే స్థానిక ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలవడం ఆనవాయితీ. ఎమ్మెల్యేను కాదని పట్టణ సీఐ.. వైసీపీ సమన్వయకర్తను కలవడం శోచనీయం. ఎన్నికల వేళ నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన అధికారులు అధికార పార్టీ సమన్వయకర్తను కలవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించేందుకే ఆయన ఇక్కడికి బదిలీ చేసుకున్నట్లు సమాచారం.


వైసీపీ సమన్వయకర్తను కలిసిన పట్టణ సీఐ పుల్లయ్య

## ఓటమి భయం

### స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నికలకు జంకుతున్న వైసీపీ


కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో దిష్టిబొమ్మగా ఉన్న వాటర్‌ప్లాంటు




పదవీకాలం జూలై వరకు పొడిగింపు
కమిటీల్లో పెద్దఎత్తున ఖాళీలు
హెచ్‌ఎంలు, టీచర్లకు కొత్త సమస్యలు

అన్ని వర్గాల్లో వ్యతిరేకతను పసిగట్టిందో, ఏమోగానీ అధికార వైసీపీ ఎలాంటి ఎన్నికలకు సాహసించడం లేదు. కనీసం పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలకు కూడా ససేమిరా అంటోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్కూల్ కమిటీ ఎన్నికలకు వెళ్లే సాహసం అధికార పక్షం చేయట్లేదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ ఎన్నికల్లో వ్యతిరేక ఫలితాలు వస్తే ఆ ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై పడుతుందని అధికార పార్టీ అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. ఓటమి భయంతోనే స్కూల్ కమిటీ ఎన్నికలకు వెళ్లట్లేదన్న వాదన్న రాజకీయ వర్గాల నుంచి వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో కమిటీల పదవీ కాలాన్ని ఈ ఏడాది జూలై వరకు మరోసారి పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి గతేడాది సెప్టెంబరు నాటికే కమిటీల రెండేళ్ల పదవీకాలం ముగిసింది. అప్పట్లో మూడు నెలలు పొడిగించారు. తాజాగా మరో ఆరునెలలు పొడిగించడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు కొత్తచిక్కులు ఏర్పడ్డాయి. పేరెంట్స్ కమిటీల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో చెల్లింపుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మళ్లీ పొడిగించడంతో ఎలా చేయాలని వారు ఆవేదన చెందుతున్నారు. - ధర్మవరం

**వ్యతిరేకత బయటపడుతుందనే..?**

గతేడాది సెప్టెంబరులోనే పేరెంట్స్ కమిటీల పదవీకాలం ముగిసింది. అప్పట్లో మూడునెలలపాటు పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఆ గడువు కూడా ముగిసింది. ఈసారి ఎన్నికలకు వెళ్తారని భావించింది. ప్రభుత్వం మాత్రం ఆ సాహసం చేయలేదు. పొడిగింపునకే పచ్చజెండా ఊపింది. ఇందుకు కారణాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఇప్పటికే అన్నివర్గాల్లో పాలక పక్షం వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉంది. ఈ నేపథ్యంలో పేరెంట్స్ కమిటీలకు వెళ్తే.. ప్రతికూల ఫలితాలు వస్తే పరిస్థితి ఏంటన్న భయం అధికార పార్టీని వెంటాడుతోందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కారణాలతో ఎన్నికలకు వెళ్లలేదన్నది నిర్వివాదాంశం.

**క్షేత్రస్థాయిలో ఇబ్బందులు**

స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్, హెచ్‌ఎంల పేరుతో సంయుక్త బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసుకుని నాడు-నేడు నిధులు ఖర్చు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల నిర్వహణలో పేరెంట్స్ కమిటీ కీలకం. పాలకవర్గాల గడువు ముగిసినా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే ముందు క్షేత్రస్థాయిలో ఉండే ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కమిటీల్లో అన్నివర్గాల నుంచి ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉండగా... కొన్నివర్గాలు తమకు పదవులు వద్దని తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బిల్లుల చెల్లింపులు నిలిచిపోయే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

**అప్పట్లోనే గట్టి పోటీ..**

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1553, ప్రాథమికోన్నత 229, హైస్కూళ్లు 315 ఉన్నాయి. వైసీపీ అధికారం చేపట్టాక రెండేళ్ల క్రితం స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నికలు తొలిసారిగా నిర్వహించింది. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ భారీ మెజార్టీతో అధికార పగ్గాలు చేపట్టింది. అయినా.. పేరెంట్స్ కమిటీ ఎన్నికలను టీడీపీ నాయకులు పలుచోట్ల సవాల్‌గా తీసుకుని, హోరాహోరీగా తలపడ్డారు. వైసీపీ దౌర్జన్యంతో కమిటీల్లో పార్టీకి చెందిన వారినే ఎన్నుకున్నట్లు ఆరోపణలు వినిపించాయి. అప్పట్లో వైసీపీ నాయకులు కూడా కమిటీ పదవుల కోసం పోటీపడ్డారు.

**పెద్దఎత్తున ఖాళీలు**



పాఠశాలల విలీనం, నాడు-నేడు పనులు పూర్తికాకపోవడంతో తరగతి గదుల సమస్య తలెత్తింది. దీంతో కొందరు తల్లిదండ్రులు అసౌకర్యాల నడుమ తమ పిల్లల చదువు సరిగా సాగదని ప్రైవేటు స్కూళ్ల బాట పట్టారు. మరికొంతమంది పాఠశాలలను విడిచి వెళ్లిపోయారు. ఇలా వెళ్లిన పిల్లల తల్లిదండ్రుల్లో ఎవరైనా స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా, సభ్యులుగా ఉంటే వారి స్థానంలో కొత్తవారిని ఎన్నుకోవాల్సి ఉంది. ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున ప్రాథమిక పాఠశాలలో 15 మందిని, ఉన్నత పాఠశాలలో 24 మందిని పాలకవర్గ సభ్యులుగా ఎన్నుకోవాలి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ కమిటీలో అధికార పార్టీకి చెందిన నేతలు తమ వర్గానికి చెందిన వారే చైర్మన్‌గా, సభ్యులుగా ఉంచేందుకు పోటీపడ్డారు. ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది. స్కూల్ కమిటీ పదవులు దండగ అన్న ఉద్దేశంలో వైసీపీ నేతలే ఉన్నారు. వైసీపీపై కూడా అన్నివర్గాల్లో వ్యతిరేకత నెలకొన్న నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ఖాళీ అయిన పదవులకు పోటీపడేవారే కరువయ్యారు. ఖాళీ అయిన చైర్మన్ స్థానాల భర్తీకి ఆపసోపాలు పడాల్సి వస్తోందని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

**ఉత్తర్వులు వచ్చాయి**

స్కూల్ పేరెంట్స్ కమిటీల పదవీకాలం గతేడాది ముగిసింది. 2024 విద్యాసంవత్సరానికి పాత కమిటీలనే కొనసాగించాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- నాగరాజు, విద్యాశాఖ ఏడీ-1

**ప్రగల్భాలే..**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి కార్పొరేట్లకు దీటుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు నవ్వులపాలవుతున్నాయి. పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో విద్యార్థుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవట్లేదు. జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయి. ఆగమేఘాలపై నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం అందుకు తగినట్లు పాఠశాలల్లో సదుపాయాలు కల్పించలేదు. నాడు-నేడు కింద వసతులు కల్పిస్తామని చెప్పినా అత్యధిక పాఠశాలల్లో నేటికీ పునాదులే పడలేదు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ, వంటశాలలు, తాగునీరు, విద్యుత్, బెంచీలు, గ్రీన్‌బోర్డుల ఏర్పాటు తదితర వసతులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించినా నేటికీ అవి నత్తనడకన సాగుతున్నాయి. పాఠశాలల నిర్వహణ కోసం విడుదల చేసే నిధులతోనే విద్యుత్, ఇంటర్నెట్ బిల్లుల చెల్లింపు, ఫ్యాన్లు, వాష్‌రూంలో కొళాయిలు, పైపుల మరమ్మతులు, కంప్యూటర్లు రిపేరీ చేయిస్తున్నారు. స్టేషనరీ ఖర్చుల కోసం ఈ ఏడాది కేటాయించిన బడ్జెట్‌లో 20శాతం మాత్రమే నిధులు విడుదల చేశారు. పాఠశాలల్లో పనులకు ప్రాధాన్యమిస్తున్నామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పలురకాల చెల్లింపులు ఆగిపోవడం, మెటీరియల్, సిమెంటు, ఇసుక కొరత ఏర్పడటంతో పనులు నిలిచిపోతున్నాయి.

## మహాత్ముడిని మరిచారు..




పూలహారం కూడా వేయకపోవడంతో బోసిపోయిన గాంధీజీ విగ్రహం

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు, జాతిపిత మహాత్మా గాంధీజీనే మరిచారు. దేశవ్యాప్తంగా మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాల వద్ద నివాళులు అర్పించారు. ధర్మవరంలో మాత్రం విస్మరించారు. పట్టణంలోని గాంధీసర్కిల్‌లో నేత కార్మికులకు చిహ్నంగా ఏర్పాటుచేసిన మహాత్మాగాంధీ విగ్రహానికి వర్ధంతి రోజు కనీసం పూలమాల కూడా వేయలేదు. మహనీయుడిని స్మరించుకునేందుకు ఆయన విగ్రహం ఏర్పాటుచేసి, వర్ధంతి, జయంతి రోజుల్లో కనీసం నివాళి అర్పించకపోవడంపై పట్టణ వాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

-ధర్మవరంరూరల్



డీఈఈకి అభ్యంతరాల పత్రాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

## ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

**అనంతపురంరూరల్, జనవరి 30:** వార్షికాదాయ అవసర నివేదిక (ఎఆర్ఆర్), మల్టీ ఇయర్ టారిఫ్(ఎంఐటీ)పై ఒకేసారి కాకుండా వేరువేరుగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో తమ పార్టీ అభిప్రాయాలు, అభ్యంతరాలను మెయిల్ ద్వారా ఏపీఈఆర్‌సీ ఛైర్మన్‌కు పంపారు. అనంతరం డీఈఈ వివేకానందస్వామికి అభిప్రాయ, అభ్యంతరాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నుంచి ట్రూఅప్ చార్జీల విధానాన్ని రద్దు చేయాలన్నారు. మిగులు విద్యుత్ అమ్మకం గురించి చెప్పలేదన్నారు. డిస్కంలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.22,234,60 కోట్లు బకాయి ఉందనీ, దీంతో డిస్కంలు అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. ఆ భారం వినియోగదారులపైనే పడుతోందన్నారు. రూ.50వేల కన్నా ఎక్కువ మొత్తాలు బాకీ పడ్డ వినియోగదారులు 2023 సెప్టెంబరు నాటికి ఎస్పీడీసీఎల్ పరిధిలో రూ.3,237.32 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదన్నారు. గత మూడేళ్లలో ఉమ్మడి అనంత జిల్లాలో 250మంది విద్యుత్ ప్రమాదాల్లో మరణించారన్నారు. 20ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎల్‌టీ లైన్లను హైఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ పథకం కింద 11కేవీ (హెచ్‌టీ)కీ మార్చడమే ప్రమాదాలకు కారణమన్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ముస్కిన్, లోకనాథ్ పాల్గొన్నారు.

## కరోనాతో మృతిచెందిన వైద్యులకు నివాళి



నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

**అనంతపురం టౌన్, జనవరి 30:** కొవిడ్ అమరవైద్యుల దినంగా సందర్భంగా కరోనా మరణించిన వైద్యులు, వైద్యసిబ్బందికి జిల్లా ఆస్పత్రిలో పలువురు మంగళవారం నివాళులర్పించారు. ఇందులో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఐఎంఏ నాయకులు ఎండ్లూరి ప్రభాకర్, అభిషేక్‌రెడ్డి ఆర్ఎంఓలు పద్మజ, హేమలత, సీనియర్ వైద్యులు నవీన్ కుమార్, ఆత్మారామ్, సౌజన్యకుమార్, రామస్వామి, ఐఎంఏ నాయకుడు మనోరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



శ్రీరామ్ సమక్షంలో టీడీపీలో చేరిన పట్టుచీరల వర్క్స్ కార్మికులు

**ధర్మవరం రూరల్, జనవరి 30:** సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ హామీ ఇచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పట్టుచీరల వర్క్స్ అసోసియేషన్ సభ్యులకు చెందిన 30 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకువచ్చారు. ధర్మవరంలో ఉన్న పట్టుచీరల వర్క్స్ కార్మికులకు గుర్తింపుకార్డులను అందజేస్తామని శ్రీరామ్ వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి చేనేత పథకానికి అర్హులుగా గుర్తిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డుతోపాటు ఇంటిస్థలం ఇచ్చి, ఇల్లుకట్టించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాబోతోందని, అందరికి తగిన న్యాయం చేసి గుర్తింపు ఇస్తామని పేర్కొన్నారు.

## పూలు విసిరి వేధించాడు

### వైసీపీ కౌన్సిలర్‌పై మున్సిపల్ చైర్‌పర్సన్ ఫిర్యాదు

**రాయదుర్గం టౌన్, జనవరి 30:** 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు వేడుకలకు హాజరైన తనపై వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్ డిష్ గోవిందు పూలు విసిరి, అసభ్యంగా ప్రవర్తించారని రాయదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయదుర్గం జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల ముగింపు సభ జరిగింది. కార్యక్రమానికి అధికార పార్టీకి చెందిన చైర్‌పర్సన్ శిల్పతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు హాజరయ్యారు. వేదికపై కూర్చున్న తనపై సొంత పార్టీ కౌన్సిలర్ గోవిందు వెనుక నుంచి పూలు విసిరాని, దీంతో తోటి కౌన్సిలర్లు ఆయనను మందలించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఆమె అర్బన్ సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. గతంలో ప్రసన్న వెంకటరమణస్వామి రథోత్సవంలోనూ గోవిందు తన అనుచరులతో రాళ్లతో దాడి చేయించారని వాపోయారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సైతం అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, వెకిలి చేష్టలు చేస్తున్నారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గతంలో ఎస్పీకి ఫిర్యాదు చేశానని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా స్పందించాలని ఆమె పోలీసులను కోరారు.

# గొంతెండుతోంది..!



కళ్యాణదుర్గంలో తాగునీటి కోసం రాస్తారోకో చేస్తున్న మహిళలు (ఫైల్)

● కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తీవ్రమైన తాగునీటి సమస్య ● బిందెడు నీటి కోసం వ్యవసాయ తోటలకు పరుగులు ● 50 గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు ● కష్టాలు పడుతున్నా కన్నెత్తి చూడడం లేదు : అధికారులు, నాయకులపై ఆగ్రహం

**కళ్యాణదుర్గం, జనవరి 30 :** వేసవికి ముందే నీటి కష్టాలు చుక్కలు చూపిస్తున్నాయి. బిందెడు నీటి కోసం నానా ప్రయాసలు తప్పడం లేదు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. తాగునీటి ఎద్దడితో సుమారు 50 గ్రామాల ప్రజలు మైళ్లకు మైళ్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. బిందెడు నీరు దొరకాలంటే గగనంగా మారిపోయింది. కొందరు సర్పంచ్‌లు తాగునీటి సమస్య పరిష్కారానికి ముందుకు వస్తున్నా 350 అడుగుల నుంచి 450 అడుగుల లోతు వరకు బోర్లు తవ్వినా నీరు పడడం లేదని వాపోతున్నారు. దీన్ని బట్టి చూస్తే పాతాళగంగ ఏ స్థాయిలో అడుగంటిపోయిందో అర్థం అవుతోంది. దీంతో కొత్తబోర్లు వేయడానికి ఎవ్వరూ సాహసించలేకపోతున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే నెలల తరబడి మంచినీటి సమస్యతో సతమతం అవుతున్నారు.

● చాలా గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేసే దుస్థితి నెలకొంది. కొద్దివరకు తాత్కాలిక ఉపశమనం లభించే శ్రీరామిరెడ్డి నీరు కూడా ఆగిపోవడంతో, సమస్య మరింత జఠిలంగా మారింది. ఈ కన్నీటి కష్టాలు ఇంకా ఎన్నాళ్లు అంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంబదూరు మండలం మర్రిమాకులపల్లిలో ఎడ్లబండిపై నీటి కోసం పొలాలకు వెళ్తున్న గ్రామస్థులు

● కంబదూరు మండల పరిధిలోని మర్రిమాకులపల్లిలో ఆరు నెలల నుంచి తాగునీటి సమస్యతో సతమతం అవుతున్నారు. పొలాలకు కరెంటు వస్తే చాలు, బిందెడు నీటి కోసం బావుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఎద్దుల బండ్లు, సైకిళ్లు, ఆటోల్లో నీటిని తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నారు. ఇదే గ్రామంలోనే ఎంపీ తలారి రంగయ్యను మహిళలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిలదీశారు. అయినప్పటికీ సమస్య తీరలేదు.

● కళ్యాణదుర్గం పట్టణంలో సుమారు 50 వేల జనాభా ఉన్నారు. ఇక్కడా తాగునీటి ఎద్దడితో అల్లాడిపోతున్నారు. సాక్షాత్తు మంత్రి నియోజకవర్గమైన ఉషశ్రీచరణ్ ఇలాఖాలోనే కన్నీటి కష్టాలతో అష్టకష్టాలు పడుతున్నారు. పట్టణంలోని ఆర్డీటీ ఆసుపత్రి ఎదురుగా మహిళలందరూ ఖాళీ బిందెలు చేతపట్టుకుని గుక్కెడు నీరివ్వండి..అంటూ అధికారులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇటీవల నినాదాలు చేసి నిరసన చేపట్టారు. మంత్రి, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు..ఇంత మంది ఉన్నా ఏ ఒక్కరూ తాగునీటి సమస్య పరిష్కరించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చిన్నారులకూ తప్పని నీటి కష్టాలు



### పట్టించుకునే నాథుడే లేదు: చిట్టెమ్మ, కళ్యాణదుర్గం

తాగునీళ్లు ఉన్నాయా లేవా అని కాలనీల్లోకి వచ్చి అడిగే కౌన్సిలర్ కానీ, నాయకుడు కానీ కరువయ్యారు. కేవలం సంక్షేమ పథకాలు అందాయా లేదా అని ఫోన్లు చేసి అడగటం తప్పా, కనీస అవసరమైన తాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదు. బిందెడు నీటి కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ తోటలకు వెళ్తున్నాం. ఎన్ని సార్లు పోరాడినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించకపోతే రోడ్లపైకి ఎక్కి, రాస్తారోకో చేపడ్తాం.

### అష్టకష్టాలు పడుతున్నాం: గంగమ్మ, కళ్యాణదుర్గం

బిందెడు నీటి కోసం మైళ్లకు మైళ్లు నడవాల్సి వస్తోంది. వ్యవసాయ బావుల వద్ద నుంచి మోసుకుంటూ అష్టకష్టాలు పడుతున్నాం. ఇప్పటికైనా నీటి సమస్యను పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడించి నిరసన చేపడ్తాం.



### ఎవ్వరూ పట్టించుకోవడం లేదు : అలివేలమ్మ

ప్రజాప్రతినిధులు మా కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదు. నెలరోజులుగా సమస్య మరింత తీవ్రమయ్యింది. చివరికి చందాలు వేసుకుని ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుని ఉపశమనం పొందుతున్నాం. కూలీ పని చేసుకుని బతికే మేము నీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడడం దురదృష్టకరం.



# సమైక్యాంధ్ర కేసుల్లో టీడీపీ నేతలకు విముక్తి

● కేసు కొట్టివేస్తూ ప్రజాప్రతినిధుల కోర్టు తీర్పు ● మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు ఊరట

**అనంతపురం, జనవరి30 (ఆంధ్రజ్యోతి):** సమైక్యాంధ్ర ఉద్యమ నేపథ్యంలో నమోదైన కేసుల్లో ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలకు ఎట్టకేలకు విముక్తి లభించింది. ఉద్యమంలో నమోదైన కేసులను కొట్టివేస్తూ విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. దీంతో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు ఊరట లభించింది. రాష్ట్రాన్ని విభజించొద్దంటూ వివిధ రూపాల్లో నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు, దిగ్బంధాలు నిర్వహించిన క్రమంలో దశాబ్దం క్రితం అనంతపురం వన్‌టౌన్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా 147, 148, 336, 427, 506 రెడ్‌విత్ 14 సెక్షన్ల కింద మాజీ మంత్రులు పరిటాల సునీత, కాల్వ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారధి, గోనుగుంట్ల సూర్యనారాయణ, నాయకులు బీవీ వెంకటరాముడు, బుగ్గయ్య చౌదరి, తలారి ఆదినారాయణ, ప్రకాష్‌నాయుడు, స్వామిదాస్, కృష్ణకుమార్, సరిపూటి రమణ, మణికంఠ బాబు, వెంకటప్ప, మరూరు గోపాల్, సద్దల చెన్నప్ప, కూచి హరి, నారాయణస్వామి, గోనిపట్ల శీనా, ఎల్లుట్ల వెంకటస్వామిలతో పాటు గతంలో టీడీపీలో ఉండి ప్రస్తుతం వైసీపీలో ఉన్న నదీం అహమ్మద్, మహాలక్ష్మి శ్రీనివాస్‌లపై అప్పట్లో కేసులు నమోదు చేశారు. ఆ కేసులకు సంబంధించిన విచారణ విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టులో సుదీర్ఘంగా సాగింది. పలు వాయిదాల అనంతరం మంగళవారం సమైక్యాంధ్ర ఉద్యమంలో నమోదైన కేసులను కొట్టివేస్తూ ప్రజాప్రతినిధుల కోర్టు తీర్పు వెలువరించడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా... ఈ తీర్పుపై మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారధులు స్పందిస్తూ... రాష్ట్రం ఐక్యంగా ఉండాలనే ఉద్దేశంతో సమైక్యాంధ్ర ఉద్యమంలో పోరాడామన్నారు. ఆ రోజుల్లో రాష్ట్ర విభజన జరగొద్దని కేసులకు వెరవకుండా ప్రజల పక్షాన ఉద్యమించామన్నారు. తెలుగుప్రజలు ఐక్యంగా ఉండాలని అనేక కార్యక్రమాలు చేశామన్నారు. ఆ క్రమంలోనే తమతోపాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయన్నారు. కోర్టు తీర్పు సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు



కోర్టు బయట హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

## రైళ్ల రద్దు, దారి మళ్లింపు

**గుంతకల్లు, జనవరి30:** శ్రీ సత్యసాయి జిల్లాలోని పెనుకొండ-మక్కాజిపల్లి మధ్య ట్రాఫిక్ సమస్య కారణంగా పలు రైళ్లను దారిమళ్లించనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. జైపూర్-మైసూర్ (నెం. 12976) ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 31న, ఫిబ్రవరి 5న ధర్మవరం, బసంపల్లి, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, నారాయణపురం, పెనుకొండ స్టేషన్ల మీదుగా మళ్లించనున్నారు. కాచిగూడ-యశ్వంతపూర్ (నెం. 20703) రైలును, మైసూరు-జైపూర్ (నెం. 12795) రైలును ఫిబ్రవరి 1 నుంచి 6వ తేదీ వరకూ, కోర్బా-యశ్వంతపూర్ (నెం.12252) రైలును ఫిబ్రవరి 1, 2 తేదీల్లోనూ, బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (నెం.22684)ను ఫిబ్రవరి 1న పెనుకొండ, నారాయణపురం, ప్రశాంతి నిలయం, బసంపల్లి మీదుగా మళ్లించనున్నారు.

● కర్ణాటకలోని కొప్పల్-గినిగెర స్టేషన్ల మధ్య ఏర్పడిన ట్రాఫిక్ బ్లాక్ కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. నరసాపురం-హుబ్లీ ఎక్స్‌ప్రెస్ (నెం. 17225) రైలును ఫిబ్రవరి 2న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 17226)ను 3న, హుబ్లీ-గుంతకల్లు-హుబ్లీ ప్యాసింజరు (నెం. 07337/38) రైళ్లను. బెళగావి-ఖాజీపేట్ (నెం.07335) రైలును ఫిబ్రవరి 3న, ఖాజీపేట్-బెళగావి (నెం. 07336) రైలును 4న రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

## తుది జాబితాలోనూ అవకతవకలు

**ఉరవకొండ, జనవరి 30:** ఓటరు తుది జాబితాలో సైతం అవకతవకలు బయట పడుతూనే ఉన్నాయి. పలు పోలింగ్ కేంద్రాలలో మరణించిన వారు, డబుల్‌ఎంట్రీ, వలసవెళ్లిన వారి పేర్లు జాబితాలో దర్శనమిస్తున్నాయి. పట్టణంలో 129 పోలింగ్ బూత్‌లో 706మంది ఓటర్లు ఉన్నారు. ఆ జాబితాలో మృతి చెందిన వారి పేర్లు అలాగే కొనసాగించారు. వలస ఓటర్లను కూడా అలాగే ఉంచారు. వారి పేర్లు తొలగించాలని బీఎల్ఏలు ప్రతిపాదించినా తుది ఓటర్ల జాబితాలో ఓటర్లుగానే ఉన్నారు. 125పోలింగ్ కేంద్రంలో పలువురికి రెండేసి ఓట్లు ఉన్నాయి. స్త్రీ ఓటరు కాగా అక్కడ పురుషులకు సంబంధించిన ఫొటో ఉంది. పోలింగ్ కేంద్రం 105, 107లో కూడా డబుల్‌ఎంట్రీ ఓట్లు అలాగే ఉంచారు. ఉంచిన ఓట్లలో అధికశాతం వైసీపీ సానుభూతిపరులవే. వజ్రకరూరు మండలం ప్యాపిలిలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిలో సుమారుగా 50కి పైగా ఓట్లు ఉరవకొండ, ప్యాపిలిలో ఉంచారు. పాటిల్ ఆనంద్‌రెడ్డి కుటుంబానికి సంబంధించి ప్యాపిలి 196 కేంద్రంలో, ఉరవకొండ 132 కేంద్రంలో ఓట్లు ఉన్నాయి. గోపురం సత్యయ్యకు సంబంధించిన ఓట్లు 96, 138 పోలింగ్ కేంద్రాల్లో ఉన్నాయి. ఓట్లు తొలగించాలని టీడీపీ బీఎల్ఏ ఫిర్యాదు చేసినా అలాగే ఉంచారు.



రెండు చోట్ల నమోదైన ఓట్లు

# టీడీపీతోనే బీసీల అభివృద్ధి, సంక్షేమం

● ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డి



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆలం నరసానాయుడు

**నార్పల, జనవరి30:** రాష్ట్రంలో బీసీల అభివృద్ధి, సంక్షేమం ఒక్క టీడీపీతోనే సాధ్యమవుతుందని ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బీ పప్పూరు గ్రామంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య అధ్యక్షతన 'జయహో బీసీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలం నరసానాయుడు మాట్లాడుతూ బీసీ ఓట్లతో గద్దెనెక్కిన వైసీపీ వారికే మొండిచేయి చూపుతోందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు చంద్రబాబు అన్ని విధాలుగా పెద్దపీట వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని బంగాళాఖాతంలో కలపి బీసీల సత్తా నిరుపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డేర్ల సంఘం అధ్యక్షుడు వెంకట్, రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు గంగులకుంట వెంకటరమణ, కుమ్మర రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పోతులయ్య, రాష్ట్ర కార్యదర్శి కురబ శివబాల, బీసీ జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, బీసీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శులు రాజన్న, బొత్సనారాయణస్వామి, జాఫర్‌వలి, ధనుంజయ, జనసేన మండల అధ్యక్షుడు రామకృష్ణ, టీడీపీ మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, వడ్డేర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వన్నూరప్ప, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి నారాయణస్వామి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు బ్యాళ్ల నాగేంద్ర, జిల్లా అధికారప్రతినిధి పరుశురామ్, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి కోయ్యగురు పెద్దన్న, జిల్లా నాయకులు రంగారెడ్డి, లక్ష్మీనారాయణ, తలారి కుల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

# అంతా రహస్యమే..!

● పశుసంవర్ధక శాఖలో గుట్టుచప్పుడు కాకుండా సహాయకుల బదిలీలు ● రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

**అనంతపురం అర్బన్, జనవరి 30:** పశుసంవర్ధక శాఖలో ఏ పనులుచేసినా ఆ శాఖ అధికారులు అత్యంత రహస్యంగా కానిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇటీవల ఆ శాఖలో సహాయకుల పోస్టులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 473 పోస్టులకు 919 మంది పరీక్ష రాయగా మెరిట్, రోస్టర్ మేరకు తొలి విడతలో 206 మంది అర్హత సాధించారు. కనీసం పత్రికల్లో ప్రకటించకుండానే సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. అభ్యర్థులకు నేరుగా మెసేజ్‌లు పంపించామని, అలాంటప్పుడు పత్రికలకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏమిటన్న ధోరణిలో ఆ శాఖ అధికారులు ప్రవర్తించడం గమనార్హం. తాజాగా ఇదివరకు జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో విధులు నిర్వర్తించే పశుసంవర్ధక సహాయకుల బదిలీల ప్రక్రియను అత్యంత రహస్యంగా చేయడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో 219 మంది పశుసంవర్ధక సహాయకులు పనిచేస్తున్నారు. వీరిలో 170 మంది తమను ఇతర ఆర్బీకేలకు బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం ఆయా సిబ్బంది బదిలీల కోసం పశుసంవర్ధక శాఖ అధికారులు రహస్యంగా కసరత్తు చేశారు. ఎలాంటి కౌన్సిలింగ్ చేయకుండానే సిబ్బంది ఇచ్చిన మూడు ఆప్షన్లల్లో అనుకూలమైన స్థానానికి బదిలీ చేస్తామని ఆ శాఖ అధికారులు చెబుతుండటం గమనార్హం. ఈ విధానంపై కొందరు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే స్థానానికి ఇద్దరు, ముగ్గురు మొదటి ప్రాధాన్యం ఇచ్చినప్పుడు కౌన్సిలింగ్ నిర్వహించకుండా ఏ రకంగా స్థానాలు కేటాయిస్తారంటూ ఆందోళన చెందుతున్నారు. హడావుడిగా ఒక్క రోజులోనే బదిలీల ప్ర క్రియను ముగించేసి బుధవారం బదిలీల జాబితాను విడుదల చేసేందుకు ఆ శాఖ అధికారులు సిద్ధం కావడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల ఒత్తిడిల నేపథ్యంలోనే బదిలీల ప్రక్రియను కౌన్సిలింగ్ చేయకుండా హడావుడిగా చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సందట్లో సడేమియా అన్న చందంగా నేతల ఒత్తిడుల పేరుతో కొందరు అధికారులు తమకు అనుకూలమైన సిబ్బంది నచ్చిన ప్రాంతానికి బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై చొరవ తీసుకొని పారదర్శకంగా బదిలీల ప్రక్రియ జరిగేలా చూడాలని సిబ్బంది కోరుతున్నారు. మరి ఏ మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.



పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం

# ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు తప్పని కష్టాలు

**రోడ్లు, విద్యుత్, నీటి వసతిలేక ఇక్కట్లు**

**పలుమార్లు విన్నవించినా స్పందించని అధికారులు**

**ఇదీ జగనన్న కాలనీ నిర్మాణాల్లో దుస్థితి**


ట్యాంకర్లతో నీటిని తెచ్చుకుంటున్న లబ్ధిదారుడు

**గాండ్లపెంట, జనవరి 30:** జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో గృహాలు నిర్మించి, తాళాలు అందిస్తామని అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆ మాటను ప్రభుత్వం నిలబెట్టుకోలేక పోయింది. కాలనీలకు కనీసం రస్తా, నీరు, విద్యుత్ సౌకర్యాలను కూడా కల్పించలేకపోతున్నారు. మండలవ్యాప్తంగా 294 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 50శాతం కూడా నిర్మాణాలకు లబ్ధిదారులు మొగ్గు చూపలేదు. జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టాలంటే రోడ్డు, నీరు, విద్యుత్ అవసరం. అలాంటి సౌకర్యాలను ఎక్కడా కల్పించలేదు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి రాళ్లు, ఇసుక, కంకర, కడ్డీలను తరలించుకోవడానికి వాహనాలు వెళ్లడానికి రోడ్డు ఉంటే కదా అంటూ లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణం కోసం నీరు చాలా అవసరం. నీరులేక ట్యాంకర్ రూ.800తో కొనుగోలు చేయాల్సి ఉందంటున్నారు. కూలీలకు డబ్బు చెల్లించేందుకే ఇబ్బందులు పడుతుంటే నీటిని కూడా కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చిందని చెబుతున్నారు. కడ్డీలు కత్తరించుకోవడానికి, వైరింగ్‌కు, తలుపులు అమర్చడానికి కరెంటు అవసరం. అధికారులు మాత్రం పూర్తిస్థాయిలో ఇళ్లు పూర్తి అయితేనే విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని చెబుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాండ్లపెంట 88, కురమామిడి 12, కత్తివారిపల్లి 9, తూపల్లి 18, మల్లమీదపల్లి 26, తాళ్లకాలువ 6, గొడ్డివెలగల, తుమ్మలపెద్దతండా లిపి 14 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాలు సాగుతున్నాయి. లబ్ధిదారులు పలుమార్లు కనీస అవసరమైన రోడ్డు, నీరు, విద్యుత్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా, ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన తరువాతే అందిస్తామంటున్నారు.


విద్యుత్ స్తంభాలు నాటి కనెక్షన్ ఇవ్వని దృశ్యం

### ట్యాంకర్లతో నీటి కొనుగోలు

కదిరి-రాయచోటి రోడ్డులో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో నీటి సౌకర్యం లేదు. రూ. 8వందలతో ట్యాంకర్ నీరు కొనుగోలు చేస్తున్నాం. పునాది నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.20వేలు నీటికోసమే ఖర్చు చేశాను. ప్రతికాలనీలో ఒక పైపులైన్ వేసి, నిర్మాణాలు ముందుకుసాగేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

\- షఫీ, గాండ్లపెంట

### నిర్మాణాలు పూర్తయితేనే సౌకర్యాలు కల్పిస్తాం

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుంటే రోడ్లు, విద్యుత్, పైపులైన్ వేయిస్తాం. పూర్తిస్థాయిలో ఇంటి నిర్మాణం జరిగిన తరువాతే మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- కులచంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ

### విద్యుత్ సౌకర్యం కల్పించండి



జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లకు రహదారి, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. రహదారి లేకపోవడంతో ఇంటికి కావలసిన సామగ్రి ట్రాక్టర్లలో తరలించాలంటే కష్టంగా ఉంది. గుట్టల్లో ఇంటినిర్మాణం చేయలేకపోతున్నాం. ట్రాక్టర్ల యజమానులు ఇసుక, ఇటుకలు, కడ్డీలు తరలించడానికి రావడంలేదు. ఇప్పటికైనా కనీస సౌకర్యాలు కల్పించాలి.

\- ఆజాద్, గాండ్లపెంట

## వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో పల్లె రఘునాథరెడ్డి

**పుట్టపర్తి, జనవరి 30:** వైసీపీ నాయకులు పలువురు టీడీపీలో చేరారు. మంగళవారం ఓడీసీ మండలంలోని నల్లగుట్లపల్లికి చెందిన 11 కుటుంబాలు టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి పాత, కొత్త తేడాలేకుండా గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ విజయం కోసం సైనికుల్లా పనిచేయాలని సూచించారు. మంజునాథ్, మునీంద్ర, శ్రీనివాసులు, పెద్ద వెంకటరమణ, ఆంజనేయులు, వెంకటేష్, చిన్నవెంకటరమణ, సురేంద్రబాబు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఓడీసీ మండల కన్వీనర్ జయచంద్ర, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్‌రెడ్డి, నారప్పరెడ్డి, రఘునాథరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

\- ఉద్యానవన శాఖాధికారి లావణ్య


మామిడి పంటను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి

**ఓబుళదేవరచెరువు, జనవరి 30:** మామిడిలో యజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఉద్యానవన శాఖాధికారి లావణ్య సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో మామిడి పంటను ఆమె పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలవ్యాప్తంగా 9వందల హెక్టార్లలో మామిడి సాగుచేసినట్లు చెప్పారు. నాణ్యమైన పంట ఉత్పత్తికోసం సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మామిడి పూత రాలకుండా ప్రతి చెట్టుకు 350గ్రా. అమోనియం సల్ఫేట్, రెండువందల గ్రా. పోటాష్, వంద గ్రా. బోరాక్స్ పిచికారి చేయాలన్నారు. 15రోజుల తరువాత జింక్‌సల్ఫేట్ 250గ్రా. చెట్ల మొదల్లో వేయాలన్నారు. ప్రధానంగా పూత, పిందె సమయంలో తేనేమంచు పురుగు, తామర పురుగు నష్టాని కలిగిస్తాయన్నారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రైడ్ 0.3 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ 2 ఎంఎల్ లేదా యాసిఫేట్ 1.5గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

## రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

**ధర్మవరం, జనవరి 30:** బత్తలపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి అనంతపురం జట్టు తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు యశోద పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. సీనియర్ బాలికల విభాగంలో 9వ తరగతికి చెందిన హేమ, వర్షిత, 8వ తరగతికి చెందిన మిథిలా, ధాత్రి, సీనియర్ బాలుర విభాగానికి సంబంధించి 9వ తరగతి విద్యార్థి తన్మయిశ్రీ చరణ్, 8వ తరగతికి చెందిన కార్తీక్ ఎంపికయ్యారన్నారు. వీరిని మంగళవారం పాఠశాల డైరెక్టర్‌తోపాటు ప్రిన్సిపాల్ అనూప్ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల రిలే దీక్షలు


ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

**ఓబుళదేవరచెరువు, జనవరి 30:** తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో భవన కార్మికులు రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షకార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు మాట్లాడుతూ భవన కార్మికులు స్వంత ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇంటి పట్టాలకోసం పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితంలేదన్నారు. భవనకార్మికులకు పట్టాలిచ్చే వరకు దీక్షను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు నాగమణి, గంగాదేవి, శ్రీనివాసులు, రవి, విజయ్, మహేంద్ర, జెరిపిటి ప్రసాద్, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్టప్ప, కేశప్ప పాల్గొన్నారు.

## 'కక్షసాధింపు చర్యలు మానుకోవాలి'


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

**పుట్టపర్తి, జనవరి 30:** యాజమాన్యం ఉద్యోగులపై కక్షసాధింపులు మానుకోవాలని ఎన్ఎంయూ నాయకులు సూచించారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎన్ఎంయూ నాయకులు స్థానిక బస్సు డిపో వద్ద గేట్ మీట్ నిర్వహించి నిరసన తెలిపారు. జోనల్ జాయింట్ సెక్రెటరీ శ్రీరామ్‌నాయక్ మాట్లాడుతూ ఎంతో ఒత్తిడికి గురవుతూ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నా ఉద్యోగులపై అధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇది ఏమాత్రం సరికాదన్నారు. విశాఖ డీపీటీఓ నిరంకుశ వైఖరిని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షబ్బీర్, తిరుపతమ్మ, వాసు, అప్పిరెడ్డి, జనార్దన్, శివయ్య, గయాజ్‌బాషా పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

**ఓబుళదేవరచెరువు, జనవరి 30:** మండలపరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లపల్లికి చెందిన ప్రసాద్, రాధకు గాయాలయ్యాయి. ఆటోలో గొల్లపల్లి నుంచి మహమ్మదాబాద్ క్రాస్‌వైపు వెళ్తున్న వారు బోరుబావివద్ద ఆగిఉన్న ట్రాక్టర్ ట్రాలీకి అదుపు తప్పి ఢీకొన్నారు. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం ఓడీసీకి తరలించారు.

## ఘనంగా భూదలమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో భూదలమ్మ

**ముదిగుబ్బ, జనవరి 30:** మండల పరిధిలోని బూదనంపల్లిలో గ్రామదేవత భూదలమ్మతల్లి జాతర మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెండికిరీటంతో సుందరంగా అలంకరించి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

### 'నాణ్యమైన భోజనం అందేలా చర్యలు'

**ఓబుళదేవరచెరువు, జనవరి 30:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యంగా అ ందించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఎంఈఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు అనంతరం విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు సీఆర్పీలు సుధాకర్ ఉన్నారు.

### జనసేన మండల కార్యవర్గం ఎన్నిక

**ఓబుళదేవరచెరువు, జనవరి 30:** జనసేన మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి జనసేన నియోజకవర్గ నాయకులు పత్తి చంద్రశేఖర్ హాజరయ్యారు. మండలాధ్యక్షుడిగా మేకల ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు, శ్రీనివాసులు, పూజ, లక్ష్మీపతి, అడ్వకేట్ ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా కొండబోయన సతీష్ తలసాని దివాకర్‌రెడ్డి, డేరంగుల ఉపేంద్ర, సద్దాంహుస్సేన్, షేక్ రహంతుల్లాలను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా శ్రీనివాసులు, మహమ్మద్‌రఫీ, డేగ వెంకటరమణ, బాబ్‌జాన్, కేశవనాయక్, రాజశేఖర్, క్రిష్ట, రేపల ఆంజనేయులు, భాను, సంయుక్త కార్యదర్శులుగా చంద్రశేఖర్, గోవర్ధన్‌నాయుడు, రమేష్‌నాయక్, ఈశ్వర్‌నాయుడు, నవీవన్, తిరుపాల్, అనిల్‌కుమార్, వీరయ్య, ధనుంజయను ఎంపిక చేశారు.

### 'క్రమం తప్పకుండా మందులు వాడితే కుష్ఠు నయం'

**పుట్టపర్తిరూరల్, జనవరి 30:** క్రమంతప్పకుండా మందులు వాడితే కుష్టువ్యాధిని నయం చేయవచ్చని వైద్యురాలు జోత్స్న అన్నారు. మంగళవారం మండలంలోని జగరాజుపల్లి గ్రామ సచివాలయంలో స్పర్శ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైద్యురాలు మాట్లాడుతూ శరీరం మీద స్పర్శలేని మచ్చలు బుడిపెలు, కనుబొమ్మలుపై వెంట్రుకలు ఊడిపోవడం వంటి లక్షణాలు ఉంటే స్థానిక ఆశా ఏఎన్ఎం ఎంఎల్ హెచ్‌పీలకు తెలియచేసి వైద్యం పొందాలన్నారు.. కుష్టువ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో క్షయ వ్యాధి పరివేక్షకులు రాజేశ్వరి, సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్లు గోపీ, చంద్రకళ, ఎంపీపీ స్కూల్ హెడ్‌మాస్టర్ భక్తవత్సలం, చైర్మన్ వెంకటరాముడు, ఎంఎల్‌హెచ్‌పీ అపర్ణ, ఆరోగ్యకార్యకర్తలు ప్రమీల, మంజులవాణి పాల్గొన్నారు.

### దాడిచేసిన వారిపై కేసు నమోదు

**అమడగూరు, జనవరి 30:** మండలపరిధిలోని మలకవారిపల్లి గ్రామానికి చెందిన బుక్కపట్న మల్లికార్జునపై దాడిచేసినవారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ధనుంజయ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సోమవారం మలకవారిపల్లి గ్రామ శివారుల్లో ఆగవలీచెరువు వద్ద అదే గ్రామానికి చెందిన పూజారి వెంకటేష్, అతడి తండ్రి పూజారి శివప్ప మల్లికార్జునపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



ధర్మవరంలో కరపత్రాలను విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



పుట్టపర్తిలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్ర

## ధర్నాను విజయవంతం చేయండి

\- ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీంద్రారెడ్డి

**ధర్మవరం, జనవరి 30:** ఉపాధ్యాయుల సమస్యలపై ఫిబ్రవరి 1న సత్యసాయి జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం ఇప్పటి పరిష్కరించలేదన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయుల సర్వీసురూల్స్‌ను అమలుచేయాలని, బదిలీలు, పదోన్నతులు తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్లకు ఎంఈఓ, డీవైఈఓ పోస్టులను మంజూరు చేయాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్తగా మున్సిపల్ పాఠశాలలను ఏర్పాటుచేయాలని ధర్నా నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు నాగప్ప, శ్రీనివాసులు, జగదీశ్, బషీర్, గోపీ, చెన్నుడు, వెంకటరాముడు, శేఖర్, చలపతి, మురళి పాల్గొన్నారు.

**పుట్టపర్తిరూరల్:** రాష్ట్రంలో మునిసిపల్ ఉపాధ్యాయులపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ఏపీటీఎఫ్ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంలో విద్యారంగం పట్ల ప్రభుత్వతీరు దారుణంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఫిబ్రవరి 1న జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని నిరసన తెలియచేయాలన్నారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాటమేరకు సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను, పీఆర్సీ అరియర్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు రాజశేఖర్, రామకృష్ణ, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలి

నెలవారీ నేరసమీక్షలో ఎస్పీ మాధవరెడ్డి



**పుట్టపర్తిరూరల్, జనవరి 30:** రాబోయే ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో నెలవారీ నేర సమీక్షకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలన్నారు. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. పాతనేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేయాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై, హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎవరు అలసత్వం వహించినా చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారు ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. అనంతరం ఎన్నికల నియమావళిపై రిటైర్డు ఆర్డీఓ పలుసూచనలు చేశారు. సమావేశంలో అడిషినల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీలు వాసుదేవన్, కంజక్షన్, హుస్సేన్‌పీరా, శ్రీలత, సీఐ రవీంద్రనాథరెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీహర్ష లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.


పుట్టపర్తిలో మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు


ధర్మవరంలో గోనుగుంట్ల అనుచరులు..

## జాతిపితకు ఘననివాళి

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ముదిగుబ్బలో ఆర్యవైశ్యసంఘం నాయకులు, ధర్మవరంలో గోనుగుంట్ల అనుచరులు, కదిరిలో జనసేన పార్టీ నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా పుట్టపర్తిలో టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు.

\- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్

## అంకితభావంతో పనిచేయండి: పరిటాల శ్రీరామ్

**బత్తలపల్లి, జనవరి 30:** ప్రతి టీడీపీ కార్యకర్త అంకితభావంతో పనిచేస్తే విజయం మనదేనని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాలలో తిరిగి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నకిలీ ఓట్లను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘంటాపురం జగ్గు గృహ ప్రవేశానికి హాజరు

**బత్తలపల్లి:** తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఘంటాపురం జగ్గు మండలకేంద్రమైన బత్తలపల్లిలో నూతన గృహ ప్రవేశం మంగళవారం నిర్వహించారు. దీనికి ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్రకార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్, చల్లా శ్రీనివాసులు, నారాయణరెడ్డి, సాంబ, జక్కంపూటి నాగభూషణ, శ్రీనివాసులు, చితంబర్‌రెడ్డి, సురేంద్ర, రవి, నారాయణస్వామి, సూరి పాల్గొన్నారు.


పరిటాల శ్రీరామ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

## బదిలీ ఎస్ఐకు సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న అధికారులు

**బుక్కపట్నం, జనవరి 30:** మండల కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నఎస్ఐ నరసింహులు పట్నం పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఆయన్ను మంగళవారం రాత్రి పోలీసు స్టేషన్‌లో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్య హాజరై మాట్లాడారు. మండలంలో ఎస్ఐగా నరసింహులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి ప్రజలు మన్ననలు పొందారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పుట్టపర్తి, కొత్తకొరువు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మవరం మున్సిపాలిటీ నూతన కమిషనర్ బాధ్యతల స్వీకరణ



**ధర్మవరం, జనవరి 30:** పట్టణ నూతన కమిషనర్‌గా టీఎస్ రవికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న బండిశేషన్న తెనాలికి బదిలీపై వెళ్లారు. దీంతో మండపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న రవికుమార్ ధర్మవరం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్లలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణ అభివృద్ధిపై చర్చించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

### జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

**నల్లచెరువు, జనవరి 30:** మండలంలోని బండ్రేవాండ్లపల్లికి చెందిన అమరనాథ్‌రెడ్డి (38) ఉరివేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. జ్యోత్స్నతో వివాహమైందని, వారికి కుమార్తె ఉందన్నారు. మృతుడు ఏడు సంవత్సరాలుగా మద్యానికి బానిస కావడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. రెండునెలల క్రితం పుట్టపర్తి రూరల్‌స్టేషన్‌లో అతడిపై 498 కేసు నమోదైందన్నారు. జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

### సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహకాలు

\- ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్

**పుట్టపర్తిరూరల్, జనవరి 30:** సూక్ష్మబిందు సేద్యానికి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ పేర్కొన్నారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుక్కపట్నం, కర్ణాటకనాగేపల్లి, జగరాజుపల్లి తదితర ప్రాంతాల్లో రైతులు సాగుచేస్తున్న ఉద్యానవన పంటలను, డ్రిప్పులు, స్పింక్లర్ల వినియోగాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన బిందుసేద్య పరికరాలను సబ్సిడీ ధరలకు అందించి ఆధునిక వ్యవసాయం వైపు మళ్లించడమే తమ లక్ష్యమన్నారు.

### టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

**ఓబుళదేవరచెరువు, జనవరి 30:** టీడీపీ సీనియర్ నాయకుడు బోయపాటి రామప్పనాయుడు(86) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తుదిశ్వాసవిడిచారు. గతంలో ఈయన ఎంపీపీగా, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బుధవారం ఆయన స్వగ్రామం నాయునివారిపల్లిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

## తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

**గుడిబండ, జనవరి 30 :** మండల కేంద్రంలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

## మరణించిన ఓటర్లను తొలగించండి

సబ్ కలెక్టర్ అపూర్వ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**మడకశిర రూరల్, జనవరి 30:** తుది ఓటర్ల జాబితా వెలువడేటప్పటికి మరణించిన ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ బీఎల్‌ఓలకు సూచించారు. 'తప్పుల తడకగా జక్కేపల్లి ఓటరు జాబితా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనానికి సబ్ కలెక్టర్ స్పందించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరణించిన ఓటర్ల ను తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో ఐదు మండలాల తహసీల్దార్లు డిప్యూటీ తహసీల్దార్లు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రాల కోసం పరిశీలన

**లేపాక్షి, జనవరి 30 :** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం మండలంలోని నాయనపల్లి క్రాస్ వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలను మంగళవారం కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. పాఠశాలలోని ప్రిన్సిపాల్‌గది, రిసెప్షన్‌హాల్, డాక్యుమెంటరీరూమ్, వివిధ తరగతిగదులను పరిశీలించారు. వెలుతురు, అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, తహసీల్దార్ బాబు, ఇతర అధికారులున్నారు.

## 'మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి'

**హిందూపురం అర్బన్, జనవరి 30:** మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఎస్‌ఎస్‌పీఆర్ డిగ్రీకళశాల ప్రిన్సిపాల్ ప్రగతి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎలా పొందాలనే విషయంపై మంగళవారం స్థానిక కళాశాలలో శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ వారు డిగ్రీ విద్యార్థు లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. అలాగే పరిశ్రమల స్థాపనకు కావలసిన నిధులు పొందే విధానం, ఉత్పత్తి, వాటి మార్కెటింగ్ తదితర వాటిపైన విద్యార్థులకు అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ వారు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇంక్యుబే షన్ మేనేజర్ డాక్టర్ సీ చంద్రమౌళి, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ జ్యోతి, డాక్టర్ బీ హసీనా, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీధర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి'




కోనాపురంలో శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పెనుకొండ రూరల్, జనవరి 30 :** ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ పీఓ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. అందులో భాగంగా 6వ రోజు మంగళ వారం గ్రామంలో ప్రతిఇంటికీ తిరిగి అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కరోన వ్యాధి, బ్యాక్టీరియ, సీజనల్ వ్యాధులు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**పెనుకొండ :** ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం మంగళవారం ఆరో రోజుకు చేరుకుంది. పట్టణంలోని ప్రాచీన కట్టడాలైన కోటగోడలు, రాయల వేసవి విడిది గగన్మహల్, చెరువుగేరి, బోగసముద్రం చెరువు ప్రాంతాలలో కంపచెట్లను, ముళ్ల పొదలను మంగళవారం తొలగించి శుభ్రం చేశారు. వారసత్వ కట్టడాలైన గగన్మహల్ కోటగోడలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రంగనాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీసీల ద్రోహి సీఎం జగన్

జయహో బీసీ సదస్సులో గుండుమల తిప్పేస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

**అగళి, జనవరి 30 :** బీసీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద మంగళవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. తొలుత దివంగతనేత ఎన్టీరామారావు విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షులు రంగయ్య అధ్యక్షతన కార్యక్రమంజరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గుండుమల మాట్లాడుతూ... రాష్ట్రంలో బీసీల ద్రోహి ఎవరైనా ఉన్నారంటే అది జగన్‌రెడ్డి మాత్రమేనన్నారు. బీసీలు అంటే టీడీపీ, టీడీపీ అంటే బీసీలు అన్నారు. వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, పదవులు ఇచ్చారే తప్ప వాటికి నిధులు లేవన్నారు. టీడీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి బీసీల అభ్యున్నతికి కృషిచేశారన్నారు. 2024 ఎ న్నికల్లో వైసీపీ ప్రభుత్వం గాలిలో కొట్టుకుపోవడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకరాం చేయడం తథ్యమన్నారు. ఇప్పటికే ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని, ఎక్కడికి వెళ్లినా నీరాజనాలు పడున్నారన్నారు. కావున ప్రతి టీడీపీ కార్యక ర్త, నాయకులు, అభిమానులు ఏకతాటిగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం ఇరిగేపల్లికి చెందిన 50కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే వైసీపీ నాయకులు జంగమరణపల్లికి చెందిన ముద్ల గిరియప్ప, కరిదాసనపల్లికి చెందిన మరువ ప్ప టీడీపీలోకి మరవప్ప చేరారు. వారికి గుండుమల తిప్పేస్వామి కండువాకప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమార్‌స్వామి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, నాయకులు తిప్పేస్వామి, లాయర్ గోవిందప్ప, రమేష్, ఎంపీటీసీ చంద్రప్ప, సర్పంచ్ నరసింహమూర్తి, మధూడి కర్రియన్న, సర్వేయర్ హనుమంతరాయ, జయన్న, రంగనాథ్, దినేష్, రవికుమార్, బోయ నాగరాజు, రాజన్న, శ్రీనివాసులు అరుణ్‌కుమార్, కెంచప్ప, షౌకత్, శివన్న, మల్లికార్జున, డాక్టర్ కృష్ణమూర్తి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, నరసింహప్ప, రాజా నారాయణప్ప, రామచంద్రారెడ్డి, శివన్న, రొళ్ల కన్వీనర్ దాసిరెడ్డి, మకడరశిర పట్టణ అధ్యక్షుడు మనోహర్, కమ్మర శివన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టణంలో అభివృద్ధి ఎక్కడ..?

కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన వైసీపీ సభ్యులు

ఇన్నాళ్లేం చేశారని టీడీపీ సభ్యుల ప్రశ్న

20 నిమిషాలకే వాయిదా



చైర్‌పర్సన్‌ను చుట్టుముట్టిన కౌన్సిలర్లు

**హిందూపురం, జనవరి 30:** సుమారు రెండున్నర లక్షల జనాభా ఉన్న పట్టణంలో... ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ప్రతినెలా మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తారు. అయితే వైసీపీ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి హిందూపురం మునిసిపల్ కౌన్సిల్ ప్రతి సమావేశం కొట్లాటతో ప్రారంభమై నిరసనలతో ముగుస్తోంది. దీంతో ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. టీడీపీ హయాంలో మునిసిపల్ కౌన్సిల్ సమావేశం జరిగితే పట్టణ ప్రజలంతా కౌన్సిల్‌లో ఆమోదించే అంశాలు, అభివృద్ధి ప్రణాళికలపై ఆసక్తిగా తెలుసుకునేవారు. అలాంటిది వైసీపీ అధికారంలోకి వచ్చాక కౌన్సిల్ సమావేశంపై అనాసక్తి కలుగుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీ పాలకవర్గంతో కౌన్సిల్ ఏర్పడి రెండున్నరేళ్లవుతోంది. ఇప్పటి వరకు ఒక ప్రజా సమస్యపై పోరాడిన దాఖలాలు కనిపించలేదు. వారి స్వార్థ ప్రయోజనాల కోసం సమావేశాల్లో పట్టుబడుతున్నారని, ఒకరిద్దరు మాత్రం వార్డు ప్రజల కోసం ప్రశ్నిస్తున్నారని ప్రజలు అంటున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే అధికార పార్టీకి చెందిన ఒక వర్గం కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పోడియం వద్దకు వెళ్లారు. కౌన్సిలర్లు ఎన్నికై మూడేళ్లు రెండున్నరేళ్లు దాటిందని, కానీ వార్డుల్లో అభివృద్ధి చేయకపోవడంతో జనంలోకి అడుగుపెట్టడానికి భయపడే పరిస్థితి దాపురించిందని వాపోయారు. పలు సమస్యలపై నిలదీశారు. పరిగి బస్టాండులో రేకుల షెడ్డు నిర్మాణం వేలం వేయకుండా వ్యాపారులకు కేటాయించడం పట్టణంలో చర్చనీయాంశం. దాని గురించి వారెవరూ ప్రశ్నించ లేదు. వైసీ పీ కౌన్సిలర్ల ఆందోళనతో సమావేశం గందరగోళంగా మారింది. దీంతో చైర్‌పర్సన్ సమావేశాన్ని ఐదు నిమిషాలు వాయిదావేశారు. అనంతరం తిరిగి ప్రారంభించినా అధికార పార్టీ కౌన్సిలర్లు ఆందోళన కొనసాగించారు. దీంతో చైర్‌పర్సన్ ఉన్నఫలంగా సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి వచ్చే నెలాఖరి వారంలో సమావేశం జరగాల్సి ఉంటుంది. అప్పటికి ఎన్నికల కోడ్ వస్తే ఈ ప్రభుత్వంలో ఇదే చివరి కౌన్సిల్ సమావేశం. జూన్, జూలై మాసాల్లో కౌన్సిల్ సమావేశం జరగవచ్చు. అలాంటప్పుడు ప్రజా సమస్యలపై స్పందించి పరిష్క రించాల్సిన సభ్యులు సమయాన్ని వృథా చేశారని అధికారులు అనడం గమనార్హం.

### ఇన్నాళ్లేం చేశారు?

రెండున్నరేళ్లుగా పట్టణాభివృద్ధి శూన్యమని, మునిసిపాలిటీ పరిధిలో ఏ ఒక్క అభివృద్ధి పని అయినా జరిగిందని టీడీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. టీడీపీ హయాంలో వందల కోట్లు నిధులు తీసుకొచ్చి పట్టణంలో అభివృద్ధి చేశామన్నారు. అయితే ఈ రెండున్నరేళ్ల కాలంలో మీరేం చేశారని పాలకవర్గాన్ని ప్రశ్నించారు. 38వార్డుల్లో ఎక్కడైనా రూ.10లక్షలు పెట్టి ఒక రోడ్డు వేశారా? మునిసిపల్ నిధులతో ఒక్క శాశ్వత భవనమైనా నిర్మించారా అన్నారు. వచ్చిన కేంద్రం నిధులతోనే కొంతమేర పనులు జరిగటాయి తప్ప రాష్ట్ర ప్రభుత్వం నిధులతో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈ ప్రభుత్వంలో దాచుకోవడానికి, దోచుకోవడానికి సరిపోయిందని విమర్శించారు. ప్రతిపనికి ఓ ధర నిర్ణయిస్తూ పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు.

### చైర్‌పర్సన్ నిస్సహాయత

కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లే ప్రతిపక్ష సభ్యుల మాదిరి నిలదీయడంతో చైర్‌పర్సన్ ఇంద్రజ ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఒక్కసారిగా అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు చుట్టుముట్టడంతో వారికేం చెప్పాలో దిక్కుతోచక నిస్సహాయంగా నిలిచిపోయారు. సమావేశం జరిగింది 20 నిమిషాలే. అందులో అధికార పార్టీ సభ్యులు కొంతమంది మినిట్ పుస్తకంలో సంతకాలు చేసి ఐదు నిమిషాల్లో సమావేశం నుంచి బయటికి వెళ్లిపోయారు.



చైర్‌పర్సన్‌ను చుట్టుముట్టిన కౌన్సిలర్లు

# పురంలో నియంత్రణలేని ట్రాఫిక్

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహన చోదకులు



రైల్వే అండర్ బిడ్జి వద్ద ఆటోలు ఉంచి వ్యాపారం చేస్తున్న దృశ్యం

**హిందూపురం అర్బన్, జనవరి30:** రాష్ట్రంలో హిందూపురానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ ఏదీ ఒక పద్ధతిలో పాటించడం లేదనే వాదనా ఉంది. అసలే ఇరుకైన రోడ్లు. దీనికి తోడు పట్టణమంతా గుంతలు. ఇవి చాల వన్నట్లు ఎ్కడ పడితే అక్కడ ఆటోలు నిలపడం, తోపుడు బండ్లు పెట్టడం పరి పాటిగా మారింది. నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రధాన వీధుల్లో అయితే మరీ ఇబ్బంది కరంగా ఉంటోంది. ప్రధానంగా ఎన్టీఆర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, గాంధీ సర్కిల్, గురునాథ్ సర్కిల్, రహమత్‌పురం... ఇలా ఒక్కటి కాదు పట్టణమంతా ఇలాంటి పరిస్థితే ఉంది. నిత్యం రద్దీగా ఉండే రహమత్‌పురం, లేపాక్షి రోడ్డులో, రైల్వే అండర్ బిడ్జి వద్ద నిత్యం ట్రీఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడ హడావుడి చేసే కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని ప్రజలు మాట్లాడుకోవడం విశేషం.



పురంలో మహాత్ముడికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

# గాంధీజీకి ఘన నివాళి

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

పలు సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు, విద్యా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతిని జరుపుకున్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల పరిధిలో గాంధీ జీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఇంత పెద్ద దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీజీ కీలక భూమిక పోషించారని కొనియాడారు.



పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం




పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు



పెనుకొండలో గాంధీ విగ్రహం వద్ద మానవహక్కుల సంఘం నాయకులు

## వచ్చే ఎన్నికల్లో టీడీపీదే అధికారం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత



చిన్న పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న సవిత

**పెనుకొండ టౌన్ (సోమందేపల్లి), జనవరి 30 :** ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీ రాతలు మారనున్నాయని, టీడీపీ అధికారంలోకి రానుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత చిన్న పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళలతో పేర్కొన్నారు. సోమందేపల్లిలో చిన్న పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులతో మంగళవారం సవిత సమావేశమయ్యారు. వారి సమస్యలపై ఆరాతీశారు. ఈ క్రమంలో చాలీచాలని వేతనాలతో పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్నామని వారు సవిత దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ ప్రభుత్వంలో పలు పరిశ్రమలు వచ్చాయని అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో ఏ పరిశ్రమలు లేవన్నారు. ఇప్పటికీ నిరుద్యోగ యువత అప్పటి చంద్రబాబు తెచ్చిన పరిశ్రమల్లోనే పనులు చేసుకుంటున్నారన్నారు. సవిత మాట్లాడుతూ... టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు కూడా అనువైన పరిశ్రమలు ఈ ప్రాంతంలో వస్తాయని పేర్కొన్నారు. అప్పుడు మీ జీవితాలు కూడా మారుతాయని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### అధైర్య పడకండి అండగా ఉంటా : సవిత

**పెనుకొండ టౌన్(సోమందేపల్లి), జనవరి 30 :** వైసీపీ పాలనలో ఇబ్బందులు పడ్డ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని, అధైర్య పడవద్దని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పేర్కొన్నారు. సోమందేపల్లికి చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ నటరాజాచారిపై ఇటీవల అక్రమ కేసులు పెట్టారని బాధితులు అంటున్నారు. సవిత మంగళవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తూముకుంట వెంకటరాముడు భార్య జయమ్మను, రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న శ్రీనివాసులు భార్య గీతమ్మను పరామర్శించారు. బండారు శ్రీనివాసులు అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా ఆయన భార్య శిరీషకు మనోధైర్యం చెప్పారు. రోడ్డు ప్రమాదంలో చేయి విరిగి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న బూత్ కన్వీనర్ నీరుగంటి అశోక్‌ను పరామర్శించారు. ఆమె వెంట పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## తూతూమంత్రంగా మండల సమావేశం

పలువురు స్థానిక ప్రజాప్రతినిధుల డుమ్మా



ప్రజాప్రతినిధులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

**గోరంట్ల, జనవరి 30:** సభ్యులు లేక ఖాళీ కుర్చీలతో మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా మంగళవారం ముగిసింది. ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త సమావేశాన్ని ఆలస్యంగా ప్రారంభిం చారు. పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి మంగళవారం పుట్టగుండ్లపల్లి పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. ఆయన బుధవారం కమ్మవారిపల్లి పంచాయతీలో పర్యటించనున్నారు. దీంతో ఆ పర్యటనలో పాల్గొనడానికి కొంతమంది, ఏర్పాట్లుకోసం మరికొంతమంది సభ్యులు వెళ్లడంతో సమావేశం ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ఎంపీటీసీ సభ్యులు ముందుగానే సంతకాలు చేసి వెళ్లడంతో కోరం ఉందని సమావేశం జరిపారు. సర్పంచ్‌లు అధిక సంఖ్యలో హాజరుకాలేదు. దీంతో అధికారుల ప్రసంగాలతో ఎలాంటి చర్చలేకుండానే సమావేశం పూర్తి అయింది. మలసముద్రం పంచాయతీ బూదిలివాండ్లపల్లికి చెందిన కొంతమంది సభ్యుల స్థానంలో కూర్చు న్నారు. తాగునీటి సమస్య చర్చకు వచ్చినప్పుడు వారు అధికారులతో వాగ్వా దానికి దిగారు. కొంతమంది పనికట్టుకుని నీటిపథకం మోటార్లకు విద్యుత్ కనె క్షన్‌ను రివర్సులో ఏర్పాటు చేయడం ద్వారా సమస్యలు సృష్టిస్తున్నారని, అయి నా ఎప్పటికపుడు మరమ్మతులు చేయిస్తున్నామని టీడీపీ సర్పంచ్ సువర్ణమ్మ భర్త అశ్వత్థరెడ్డి తెలిపారు. అయితే పంచాయతీలోని ఇతర గ్రామాల్లో లేని సమస్య బూదిలివాండ్లపల్లిలోనే ఎందుకొస్తుందని ఏఈ ప్రశ్నించారు. సమావేశానికి ముందే మలసముద్రం పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌తో కార్యాలయం వద్ద నీటి విషయంపై ఆ గ్రామస్థులు ఘర్షణపడ్డారు. అనంతరం సమావేశంలో ధ్వజమెత్తారు. సభ్యులు తప్ప ఇతరులను సమావేశానికి అనుమతించమని, ఆజెండాలో పేర్కొన్నా.... వారు అధికారపార్టీ మద్దతుదారులు కావడంతో అధికారులు సైతం నోరు మెదపడకపోవడం గమనార్హం.

## ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపిస్తున్న సంగీత కళాకారులు

**పెనుకొండ, జనవరి 30:** సంకీర్తనచార్యులు త్యాగరాజస్వామి 176వ ఆరాధనోత్సవాలను మంగళవారం సంగీత కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన సంగీత విద్వాంసురాలు కల్పన, సత్యసాయి బాబా సంగీత కళాశాల విద్వాంసులు భరద్వజ, సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక సంగీత కళాకారులు త్యాగరాజస్వామి కీర్తనలు ఆలపించారు. ఆయనను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఉదయం శ్రీరామమందిరంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి కల్పన స్వగృహంలో సంగీత కచేరి నిర్వహించారు. త్యాగరాజ కీర్తనలు ప్రజలను అమితంగా ఆకట్టుకున్నాయి

## కుష్టువ్యాధిపై అవగాహన

**రొద్దం, జనవరి 30 :** మండలంలని ఆర్ లోచర్ల గ్రామంలో వైద్యాధికారులు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని మంగళవారం లోచర్ల గ్రామంలో అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 13వరకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కుష్టువ్యాధి లక్షణాలు గ్రామస్థులకు వివరించారు. స్పర్శలేకపోతే వెంటనే వైద్యాధికారులను స్పందించి నిర్ధారణ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఓ రమణ, వైద్యాధికారి సోమశేఖర్, సచివాలయ సిబ్బంది వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## పరిశ్రమల సందర్శన

**అగళి, జనవరి 30 :** స్థానిక ఆదర్శపాఠశాలలలో వృత్తివిద్య కోర్సు చదువుతున్న ఇంటర్ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండల కేంద్రంలోని బ్యూటీ పార్లర్, అనంత గ్రామీణ బ్యాంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా 50మంది విద్యార్థులు వృత్తి విద్య ఉపాధ్యాయులు నాగరత్నమ్మ, చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఇలా సందర్శించడం ద్వారా విద్యార్థులలో ప్రత్యేకమైన ఆలోచన పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్ జాఫర్ అధ్యాపకులు పాల్గొన్నారు.